క్లుప్తంగా

నేడు పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్‌హాల్ ప్రారంభం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పూర్వ విద్యార్థుల రూ.6 లక్షల విరాళంతో ఓ గదిని అన్ని హంగులతో అలుమ్ని సెమినార్ హాల్‌గా తీర్చిదిద్దారు. దాన్ని ఈనెల 9న ఉదయం వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

డాల్ఫిన్ బార్, రెస్టారెంట్ సీజ్



వరంగల్: హనుమకొండ సుబేదారిలోని డాల్ఫిన్ బార్ అండ్ రెస్టారెంట్‌కు సంబంధించిన ఆస్తి పన్ను రెండేళ్ల నుంచి చెల్లించకపోవడంతో బల్దియా అధికారులు శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ డాల్ఫిన్ బార్ అండ్ రెస్టారెంట్ యాజమాన్యం రెండేళ్లుగా బల్దియాకు రూ.2 లక్షల 56 వేల ఆస్తి పన్ను బకాయిలను చెల్లించాలని కోరుతూ పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించలేదని అన్నారు. ఇటీవల రెడ్ నోటీసు అందజేసినా స్పందించకపోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ యూసుపొద్దీన్, ఆర్‌ఐ దేవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈస్ట్‌జోన్ డీసీపీగా అంకిత్ కుమార్ బాధ్యతల స్వీకరణ

వరంగల్ క్రైం: రవీందర్ నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్‌జోన్ డీసీపీగా అంకిత్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అంకిత్ కుమార్‌ను ఈస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

విజయ్‌కుమార్‌కు భారత్ విభూషణ్ అవార్డు

వరంగల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ వరంగల్ ఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన ప్రజా కళాకారుడు దామెర విజయ్‌కుమార్‌ను భారత్ విభూషణ్ అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఫౌండేషన్ నేషనల్ చైర్మన్, ఫౌండర్ డాక్టర్ శ్రీనివాసరాజు చేతుల మీదుగా ఆదివారం అవార్డు అందుకోనున్నారు.

ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఏర్పాటు



నయీంనగర్: ఆదివాసీ హక్కుల సంఘీభావ వేదిక వరంగల్ జిల్లా శాఖను హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ బాధ్యులు గడ్డం లక్ష్మణ్, నారాయణరావు, జక్కుల వెంకటయ్య, చంద్రమౌళి ప్రకటించారు. కన్వీనర్లుగా రమాదేవి, కళ, రాజీ, వెంకట నారాయణ, శివ, రమేష్‌చందర్, ఉదయ్‌సింగ్, రాజ్‌మహ్మద్, అనిసెట్టి రజిత, సాయికిరణ్, బాలరాజ్, దయాకర్, క్రాంతి, ఇంద్రసేన, శాంతక్కను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ఖిలా వరంగల్: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ రామేశ్వరం సూచించారు. వరంగల్ 17వ డివిజన్ స్తంభంపెల్లిలో ఏవీఎస్ పాఠశాలలో చైర్మన్ అంకతి వీరస్వామి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అంకతి సాగర్ అధ్యక్షతన జాతీయ సైన్స్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను ఆయన పరిశీలించారు.

మళ్లీ ఉత్సవ కమిటీ..

14 మందితో ఎర్రగట్టు గుట్ట కార్యవర్గం

హసన్‌పర్తి: ఎర్రగుట్టు వేంకటేశ్వరస్వామి జాతరకు ఈసారి మళ్లీ ఉత్సవ కమిటీని నియమించనున్నారు. గతేడాది కూడా కేవలం డైరెక్టర్లతోనే ఉత్సవాలు నిర్వహించారు. రెండు నెలల క్రితమే జాతర శాశ్వత కమిటీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే సరైన సమయంలో కమిటీ దరఖాస్తు చేసుకోలేదు. గడువు దాటిన తర్వాత దరఖాస్తు చేసుకోవడంతో ఆ దరఖాస్తులను అధికారులు పరిగణిలోకి తీసుకోలేదు. కాగా, హోలీ పండుగ నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రత్యేక చొరవతో ఈసారి మళ్లీ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో హసన్‌పర్తి, భీమారం గ్రామాల నుంచి ఆరుగురు చొప్పున డైరెక్టర్లతో కూడిన జాబితాను సిద్ధం చేశారు. కమిటీగా చైర్మన్‌గా హసన్‌పర్తికి చెందిన ఆరెల్లి వెంకటస్వామి పేరును ప్రతిపాదించారు. నేడోరేపో ఉత్తర్వులు వెలువడనున్నట్లు సమాచారం.

డ్రెయినేజీ నిర్మాణానికి మోక్షమెప్పుడో..?



మండల కేంద్రంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ



డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- దుర్వాసన వెదజల్లుతున్న ప్రధాన రహదారి
- ముక్కు మూసుకుంటున్న స్థానికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

వేలేరు : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ధర్మసాగర్ మండలం సాయిపేట క్రాస్‌రోడ్డు నుంచి వేలేరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రహదారి నిర్మాణ పనులు పూర్తై మూడేళ్లు గడుస్తున్నా ఆయా గ్రామాల్లో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా అంబేడ్కర్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వెళ్లే ప్రధాన రహదారికిరువైపులా డ్రెయినేజీ లేకపోవడంతో దుర్వాసన భరించలేక స్థానికులు ముక్కు మూసుకుంటున్నారు. అలాగే పెట్రోల్ బంక్ వెళ్లే రోడ్డుకు ఒక వైపు మాత్రమే డ్రెయినేజీ ఉండగా అదికూడా అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరు నిలిచి కంపు కొడుతుందని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. అలాగే మురుగునీరు నిలిచేచోట దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వాపోతున్నారు. దానికి తోడు పందులు స్వైరవిహారం చేస్తుండడంతో రోగాల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీ నిర్మించాలి



మండల కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దోమలు, పందులకు ఆవాసాలుగా మారుతోంది. ప్రధాన రహదారి వెంట డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్ల పైకి వచ్చి ఇబ్బందులకు గురవుతున్నాం. దోమలు, ఈగల వ్యాప్తి కారణంగా రోగాల బారిన పడుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలి.

- రాసపెల్లి సంతోశ్, వేలేరు

సంక్షిప్తంగా

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



దామెర : మండలంలోని కొగిల్వాయిలో శ్రీచంద్రగిరి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 12వ తేదీ నుంచి 27 వరకు జరుగనున్నాయి. ఈ సందర్భంగా శనివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీ చంద్రగిరి చెన్నకేశవ స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

డప్పుల పంపిణీ



దామెర : మండలంలోని పులుకుర్తి గ్రామ మాజీ సర్పంచ్ గోవింద్ అశోక్ భార్య విమల జ్ఞాపకార్థం గ్రామంలోని డప్పు కళాకారులకు శనివారం 20 డప్పులను పంపిణీ చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ ఈదునూరి స్వామి, పులుకుర్తి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పరిమళపాల్, గోవిందు కర్ణాకర్ పాల్గొన్నారు.

నేడు పద్మశాలి మండల కమిటీ ఎన్నిక

శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో ఆదివారం పద్మశాలి మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు ఆ సంఘం మండల అడహక్ కమిటీ అధ్యక్షుడు వావిలాల వేణుగోపాల ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పద్మశాలిలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా



ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెంచికలపేటలో వివిధ కారణాలతో మృతిచెందిన పలు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పాల్పంచుకుంటానన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, మాజీ ఎంపీటీసీ వరుణ్‌గాంధీ, నాయకులు లింగమూర్తి, మంగ రాజు, అర్షం కృష్ణంరాజు, మండపెల్లి శ్రీను, మంగ లింగయ్య, మంగ రాజయ్య, ముదిగిరి లింగయ్య పాల్గొన్నారు.

శివాలయంలో అన్నపూజ



ఆత్మకూరు : మండల కేంద్రంలోని మహాదేవ స్వామి పంచకూట శివాలయంలో శనివారం అన్నపూజ జరిగింది. అర్చకులు రవీందర్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రాణం తీసిన అప్పులు

- పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య



రమేశ్ (ఫైల్)

వేలేరు : పక్షవాతం, ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా చికిత్స కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పీచర గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీచర గ్రామానికి చెందిన గంగారపు రమేశ్ (42) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం రమేశ్‌కు పక్షవాతం, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. చికిత్స కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు 108లో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సంధ్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఖిలా వరంగల్: ఇంటికి తాళం వేసి విదేశాలకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి సుమారు రూ.2 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారని ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

పార్కు చేసిన బైక్ చోరీ

వరంగల్ ఉర్సుగుట్ట హంటర్ రోడ్డులోని గణపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని షైన్ కళాశాల ప్రాంగణంలో పార్కు చేసిన బైక్ చోరీకి గురైనట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. పరకాలకు చెందిన కోరే కుమార్ వరంగల్ షైన్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రోజువారీగా బైక్‌పార్కు చేసి శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి



కమలాపూర్ : కేక్ కట్ చేస్తున్న ఏఎంసీ చైర్ పర్సన్ ఝాన్సీరాణి



ఆత్మకూరు : పోలీస్ స్టేషన్‌లో..



పరకాల : న్యాయమూర్తి శాలిని లింగంను సన్మానిస్తున్న న్యాయవాదులు



కమలాపూర్ : మహిళా ఉద్యోగినులను సన్మానిస్తున్న ఉద్యోగులు

కమలాపూర్ : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి చెందాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారికంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని శంభునిపల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోందని, మహిళా సంఘాలను బలోపేతం చేసి మహిళల అభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. అనంతరం మహిళ సంఘ సభ్యులు, ఉద్యోగినితో కలిసి కేక్ కట్ చేసి సీట్లు పంచిపెట్టారు. అనంతరం ఏఎంసీ చైర్ పర్సన్‌తో పాటు పలువురు మహిళలు, మహిళ ఉద్యోగినులను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుండె బాబు, ఎంపీఓ రవి, ప్రోగ్రాం కన్సల్టెంట్ రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శులు వినీల్‌రెడ్డి, సాంబరాజు, రాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరకాల: పట్టణంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని కోర్టులో న్యాయవాదులంతా మహిళా న్యాయమూర్తి శాలిని లింగంతో పాటు కోర్టులోని మహిళ ఉద్యోగినులను, సిబ్బందిని సన్మానించారు. అదే విధంగా బీజేపీ మహిళా మోర్చా మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పీ సంగీత ఆధ్వర్యంలో ప్రముఖ మహిళ వైద్యులను సన్మానించారు. అదే విధంగా మహిళ దినోత్సవం సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక సివిల్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, నాయకులు రాజేశ్, శ్రీరామ్, శ్రావణ్, రాజు, పరకాల, నడికూడ, ఆత్మకూరు మండలాల అధ్యక్షులు కృష్ణకాంత్, కుమారస్వామి, సందీప్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాయంపేట : సృష్టికి మూలం, శక్తికి రూపం, త్యాగానికి ప్రతిరూపం స్త్రీ అని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రజని అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో, మాందారిపేట శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, నృత్యం, నాటిక పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో మహిళల పాత్ర కీలకమన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తూ భావితరాలను మార్గదర్శంగా నిలవాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థినులు ప్రిన్సిపాల్ రజనిని శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పంచాయతీ మల్టీపర్పస్ మహిళా సిబ్బంది ఘనంగా నిర్వహించుకున్నారు. అంగన్‌వాడీ టీచర్ రత్నామాల, పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లతో కలిసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు వనజ, గౌరి, రమ, కోమల, ఆశా వర్కర్లు శైలజ, హిమ, స్వర్ణలత, అంగన్‌వాడీ ఆయాలు విజయ, సుభద్ర, నిర్మల, కొమురమ్మ, పద్మ, తల్లులు, అంగన్‌వాడీ చిన్నారులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో మహిళా దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ సతీశ్‌బాబు, సీఐ సంతోశ్ స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుళ్లను సన్మానించారు. అలాగే పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అబ్బు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ప్రజాపాలనలో అందరికీ సంక్షేమ ఫలాలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

దామెర : రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దామెర ,ఊరుగొండ గ్రామాల్లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణన చేసిన ఘనతా కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలేపాక శ్రీనివాస్, నాయకులు గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, సదిరం పోచయ్య, దురిశెట్టి భిక్షపతి, రవీందర్, రాజు, సుధాకర్, శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, అనిల్‌రెడ్డి, రాజిరెడ్డి, రవీందర్, రామచందర్, ప్రవీణ్, సుజాతరాజిరెడ్డి, శ్రావణ్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలి

- ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ 123 కాకుండా ఏబీసీడీగా చేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీల మండల అధ్యక్షులు తుడుం వెంకటేశ్, మామిడి భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో లక్ష డప్పులు– వేల గొంతుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. మూడు దశాబ్దాలకు పైగా మంద కృష్ణమాదిగ పోరాటం ద్వారానే ఆరోగ్యశ్రీ పథకం, పింఛన్లు, తెల్ల రేషన్‌కార్డులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు అమలవుతున్నాయని అన్నారు. మందకృష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు హైదరాబాద్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 9శాతం రిజర్వేషన్‌తో సరిపెట్టకుండా 11శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల స్టీరింగ్ కమిటీ చైర్మన్ ముక్కెర ముఖేష్, నాయకులు సంపత్, మొగిలి, మహేందర్, కుమారస్వామి, శంకర్, పెద్దకుమారస్వామి, తిరుపతి, మారేపల్లి క్రాంతికుమార్, సుధాకర్, విజయ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడేలా బడ్జెట్ ప్రవేశ పెట్టాలి

- ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కయ్య



మాట్లాడుతున్న చుక్కయ్య

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కయ్య అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, వృత్తి సంఘాల మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల సదస్సు నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత నెలలో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను విస్మయానికి గురిచేసిందని, బడా బాబులకు పెద్దపీట వేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే బడ్జెట్ సామాన్యులకు ఉపయోగపడే విధంగా ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడిగె నాగరాజు, మాదాసి పోచమ్మ, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ లింగయ్య, మండల ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, నాయకులు బాబురావు, ఉప్పలయ్య, యాకయ్య, కవిత, పోచమ్మ, సృజనతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఆత్మకూరు : ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీరామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్ సంస్థ నిర్వాహకులు మాధవిలత, చంద్రమౌళి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధ్యానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. సోమవారం నుంచి బుధవారం వరకు సాయంత్రం ధ్యానం అభ్యాసం చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రమిషన్ సభ్యులు సత్యనారాయణ, శశిధర్, ఉప్పలయ్య, పద్మావతి, ప్రకాశ్, టింగిలికారి సత్యనారాయణ, నాగబండి శివప్రసాద్, కరివేద సమ్మిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సన్మాన కార్యక్రమానికి తరలిరావాలి



మాట్లాడుతున్న నాయకులు

వేలేరు : ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించిన సందర్భంగా ఈనెల 18వ తేదీన స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో మంద కృష్ణ మాదిగకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ పోలిట్ బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగ జాతిలోనే మొదటగా మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం గర్వకారణమన్నారు. ఎస్సీలకు ఏబీసీడీ వర్గీకరణ సాధించిన ఘనత మంద కృష్ణమాదిగకే దక్కుతుందన్నారు. పార్టీలకు అతీతంగా సన్మాన కార్యక్రమానికి మాదిగలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల అడహక్ కమిటీని నియమించారు. మాజీ ఎంపీపీ అయోధ్య, మాజీ జెడ్పీటీసీలు రవి, యాదగిరి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మనోజ్ కుమార్, నాయకులు కుమార్, వీరయ్య, ప్రభాకర్, కమలేష్, రాజు, వెంకటస్వామి పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ సభ్యత్వాల స్వీకరణ



సభ్యత్వాలు పొందుతున్న జర్నలిస్టులు

పరకాల : పరకాల ప్రెస్‌క్లబ్ ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రెస్‌క్లబ్ మాజీ కన్వీనర్ దాసరి రమేశ్ తెలిపారు. పరకాల డివిజన్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులందరూ సభ్యత్వం పొందాలన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సభ్యత్వ నమోదును ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. అనివార్య కారణాలతో చాలా కాలం వాయిదా పడుతూ వస్తున్న ఎన్నికలను ఈ ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. జర్నలిస్టులు దరఖాస్తుకు అక్రిడిటేషన్ లేదా ఐడీ కార్డు, మూడు సంవత్సరాలుగా జర్నలిస్టుగా పనిచేస్తున్నట్లు అనుభవానికి సంబంధించిన జిరాక్స్ కాపీలను దరఖాస్తు ఫారానికి జతచేసి ఇవ్వాలని అన్నారు. ఎన్నికల గౌరవ సలహా దారుడు, రాములు, సునేందర్, అయిలయ్య, కరుణాకర్, చొక్కారావు, శ్రీనివాస్‌రెడ్డి, పాషా, బాలరాజు, వేణు, రాజేందర్, తిరుపతి పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

హన్మకొండ చౌరస్తా: నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు.